సాక్షి
చిత్తూరు
ఆదివారం । 11 । జూన్ । 2023



పుస్తక పఠనంతోనే విజ్ఞానం

విద్యార్థులు పుస్తకపఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. - 8లో



తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

శ్రీరంగరాజపురంలో శనివారం నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	38	27
తిరుపతి	40	28
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	40	28

న్యూస్‌రీల్

12న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం

పుంగనూరు : పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఈ నెల 12వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ మునీంద్ర నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాగరాజగౌడ్, మధు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేస్తున్న సమావేశానికి బడుగు బలహీనవర్గాల వారు పెద్దసంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

మామిడితోటల్లో ఏనుగుల తిష్ట



విరిగిన మామిడి చెట్టు కొమ్మలు

పులిచెర్ల(కల్లూరు) : కల్లూరు పరిసర గ్రామాల్లోని మామిడితోటల్లో వారం రోజులుగా ఏనుగుల గుంపు తిష్టవేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. శనివారం తలారివాండ్లపల్లె వద్ద ఏనుగులు ఉన్న విషయం గుర్తించని నాగరాజా అనే రైతు తోటలోకి వెళ్లడంతో అవి తరుముకున్నాయి. ప్రాణాలను అరచేతిలో పట్టుకుని పారిపోయి వచ్చినట్లు బాధిత రైతు వెల్లడించాడు. సుమారు 7 నుంచి 12 ఏనుగులు సంచరిస్తున్నట్లు వివరించాడు. శుక్రవారం రాత్రి కూడా మామిడితోటల్లో ఏనుగులు విధ్వంసం సృష్టించినట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగుల గుంపును అడవిలోకి దారి మళ్లించాలని కోరుతున్నారు.

కిక్కిరిసిన కాణిపాకం



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో కంపార్ట్‌మెంట్‌లు రూ.150, రూ.100తోపాటు ఉచిత క్యూలు నిండిపోయాయి.స్వామిని దర్శించుకోవడానికి సుమారు 5 గంటల సమయం పడుతోంది. వేసవి నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీఓలకు నియామక పత్రాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో నూతనంగా ఉద్యోగోన్నతులు పొందిన ఎంపీడీఓలకు శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నియామకపత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ పథకాలను సక్రమంగా ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నూతన ఎంపీడీఓలు లీలామాధవి, అబ్దుల్ కలామ్ ఆజాద్, సుధాకర్‌రెడ్డి, తాజ్ మస్రూర్, సురేష్‌బాబు, భానుమూర్తిరావు, శేషగిరిరావు, పరమేశ్వరరెడ్డి, ఉపేంద్రరెడ్డి, భానుప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో బదిలీలకు కౌన్సెలింగ్ రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వివిధ కేడర్ల కేజీబీవీ ఉద్యోగులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చిత్తూరులోని సమగ్ర శిక్ష శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బదిలీకి సంబంధించి కేజీబీవీ ప్రిన్సిపాళ్లు ఆరుగురు, సీఆర్‌టీలు- 22, పీటీటీ-1, ఏఎన్‌ఎం-1, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్-3 మొత్తం 33 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

నాడు

టీడీపీ హయాంలో సగం విద్యాసంవత్సరం గడిచిపోతే కానీ పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందించేవారు కాదు. యూనిఫామ్ అయితే అసలు ఇస్తారో.. లేదో తెలియని పరిస్థితి. కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ సర్కారు బడులను పట్టించుకునేవారు కాదు. విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించే సంగతి దేముడెరుగు.. కనీస మౌలిక వసతులు కూడా ఉండేవి కాదు. దీంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటే తల్లిదండ్రులు వెనకడుగు వేసేవారు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్కారు బడులను బలోపేతం చేయడంపైనే దృష్టి సారించింది. విప్లవాత్మకమైన పథకాలను విద్యారంగం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తోంది. పాఠశాలల ప్రారంభం రోజునే పిల్లలకు జగనన్న విద్యాకానుక కింద పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర సామగ్రితో కిట్‌లను అందిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యాభ్యాసం చేసేందుకు వీలుగా కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వసతులు సమకూర్చింది. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సంతోషంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే సుహృద్భావ పరిస్థితిని కల్పించింది.



కిట్‌లోని కానుకలు ఇవే!

- మూడు జతల యూనిఫామ్ క్లాత్ (కుట్టు కూలి సైతం చెల్లిస్తారు)
- జత బూట్లు, రెండు జతల సాక్సులు
- బెల్టు, స్కూల్ బ్యాగు
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్- తెలుగు డిక్షనరీ

భవితకు పెట్టు‘బడి’

“ విద్యపై ఎంత వెచ్చించినా.. అది భవిష్యత్‌కు పెట్టుబడే అవుతుంది. సమాజంలో అసమానతలను చదువుతోనే రూపుమాపగలం. విద్యతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యం'' ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందు కోసం ఏటా బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయిస్తున్నారు. ఖర్చు పెట్టే ప్రతిపైసాను పిల్లల ఉన్నత చదువుకే ఉపయోగపడేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా బడులు ప్రారంభమయ్యే తొలిరోజు ఈ నెల 12వ తేదీన జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు తదితర సామగ్రితో కూడిన కిట్‌లను పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు.

జిల్లా సమాచారం	
మొత్తం పాఠశాలలు	విద్యార్థులు
2,478	1,63,901
నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయనున్న కిట్‌లు	
పలమనేరు	కుప్పం
38,275	36,640
పుంగనూరు	పూతలపట్టు
27,307	19,388
జీడీ నెల్లూరు	చిత్తూరు
18,971	13,589
నగరి	
12,534	

- రేపే పాఠశాలల పునఃప్రారంభం
- తొలిరోజునే జగనన్న విద్యాకానుక పంపిణీ
- నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌లు
- పకడ్బందీగా అందించేందుకు సన్నాహాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో శ్రమిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా పథకాలను అమలు చేస్తున్నారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏటా బడులు తెరిచే రోజే జగనన్న విద్యాకానుక కిట్‌లను అందిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన జిల్లాలోని అన్ని సర్కారు బడుల్లో పండుగలా విద్యాసామగ్రి కిట్‌లను పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

నాణ్యతాప్రమాణాల మేరకు..

జగనన్న విద్యాకానుక కిట్‌లను నాణ్యతాప్రమాణాలకు మేరకే సిద్ధం చేశారు. విద్యార్థులకు బ్రాండెడ్ వస్తువులను అందించేలా చర్యలు చేపట్టారు. ఆయా సామగ్రి నాణ్యతను స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాతే జిల్లా కేంద్రాలకు తరలించారు.



బంగారుపాళ్యం హైస్కూల్‌లో విద్యాకానుకను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



పిల్లలకు పంపిణీ చేయనున్న విద్యాకానుక కిట్‌లోని సామగ్రి

ఇది కదా విజన్ అంటే..!

గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను కార్పొరేట్‌కు హస్తగతం చేసిందని పలువురు విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల కోసం జిల్లాలో ఏటా కేవలం రూ.68 కోట్లు మాత్రమే వెచ్చించేవారని గుర్తుచేస్తున్నారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల కింద జిల్లాలో ఏటా రూ.1,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని వివరిస్తున్నారు. భవిష్యత్ తరాల అభ్యున్నతిని ఆలోచించి కార్యాచరణ అమలు చేయడమే కదా నిజమైన విజన్ అని కొనియాడుతున్నారు.

మొదటి రోజే కిట్‌ల పంపిణీ



ప్రభుత్వ ఆదేశాల మేరకు జేవీకే కిట్లను బడులు తెరిచిన మొదటి రోజు పకడ్బందీగా పంపిణీ చేస్తాం. స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా విద్యార్థులకు అందించాలని అధికారులకు స్పష్టం చేశాం. ప్రతి సర్కారు పాఠశాలలో వంద శాతం విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

– షణ్మోహన్, కలెక్టర్

నాణ్యమైన సామగ్రి



సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రభుత్వం విద్యాకానుక కిట్‌లను అందించడం గొప్ప విషయం. అందులోని సామగ్రి నాణ్యంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మేము కూడా క్షేత్రస్థాయిలో జేవీకే స్టాక్ పాయింట్లను సందర్శించాం. వస్తువుల నాణ్యతను పరిశీలించాం. కిట్‌ల పంపిణీని సంబంధిత డీవైఈఓలు, ఎంఈఓలు పకడ్బందీగా పర్యవేక్షించాలని స్పష్టం చేశాం.

– విజయేంద్రరావు, డీఈఓ

ప్రతి విద్యార్థికీ అందిస్తాం



జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లోని ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్‌ను అందిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో చేపట్టిన కసరత్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు జేవీకే కిట్‌లను పకడ్బందీ పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. ఈ కిట్‌లు పిల్లలకు చాలా ఉపయోగకరం.

– వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష శాఖ

బదిలీలు.. ఉద్యోగోన్నతుల్లో నిబంధనలు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగోన్నతులు, బదిలీల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన టీచర్లు, 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న, సర్‌ప్లస్, సబ్జెక్ట్ కన్వర్షన్ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. 2008 ఎంటీఎస్ టీచర్లు పూర్వపు పాఠశాలల్లోనే కొనసాగుతారన్నారు. ఈ నెల 12వ తేదీన ఎక్కడైనా పాఠశాల మూతపడితే సంబంధిత ఎంఈఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతిలో మార్పు పొందిన స్కూల్ అసిస్టెంట్లను తక్షణమే రిలీవ్ చేసి నూతన పాఠశాలలో చేర్చుకోవాలని ఆదేశించారు. పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. పాఠశాలల పరిసరాలు తరగతి గదులను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. జగనన్న గోరుముద్ద కింద మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని ఆదేశించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

పుత్తూరు రూరల్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి రెండు దశాబ్దాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైద్య విధాన పరిషత్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఈ మేరకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే ట్రెజరీ ద్వారా జీతాల చెల్లింపునకు ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి. హిదయతుల్లా, దిల్షాద్ పాల్గొన్నారు.

సజావుగా సుపరిపాలన



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- గృహనిర్మాణాల్లో ముందంజ
- పకడ్బందీగా నీటి ఎద్దడి నివారణ
- నిరంతరం నాణ్యమైన విద్యుత్
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా సుపరిపాలన సాగుతోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. శనివారం చిత్తూరులో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాబోయే ఆరు నెలల్లో 32 వేల గృహాలను నిర్మించాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. రైతులకు 9గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని చెప్పారు. గతంలో వ్యవసాయ సర్వీసులకు 20వేల దరఖాస్తులు పెండింగ్ ఉండేవని, వాటిని 1,100లకు తీసుకువచ్చామని వివరించారు. పరిశ్రమలకు మరింత మెరుగ్గా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు 24గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ ద్వారా పెండింగ్‌లో ఉన్న రూ.43.85 కోట్ల ట్యాంకర్ల నీటి బిల్లులను చెల్లించామని వెల్లడించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.50 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పశ్చిమ మండలాల్లో శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ కింద వేలాది వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్నామని వివరించారు. ప్రతి మండలానికి ఉపాధిహామీ పథకం కింద రూ.60 లక్షల పనులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

- **జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు :** పాఠశాలలు సోమవారం ప్రారంభమవుతున్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేయాలి. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఫ్యామిలీ డాక్టర్ కింద ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నాం. మంత్రి పెద్దిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. పదోతరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పథకం కింద సత్కరించనున్నాం. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు వైద్యసిబ్బంది కృషి చేయాలి.
- **సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం :** సచివాలయ పరిధిలోని వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు సబ్సిడీ ఎరువుల, విత్తనాలు, ఉచిత విద్యుత్‌పై రైతులకు అవగాహన కల్పించాలి. సత్యవేడులోని గురుకుల పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలి.
- **జెడ్పీటీసీ సభ్యులు :** గంగవరం మండలం గుండిగుట్లు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరుకావడంలేదు. సత్యవేడు, శ్రీకాళహస్తిలో గృహ నిర్మాణాల పురోగతి నత్తనడకన సాగుతోంది. వీటిపై మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ స్పందించారు. తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల, ఎన్‌ఆర్‌జీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీధర్, ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసీ, గంగాభవాని, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ వాహనం చోరీ

పలమనేరు: సెబ్ పోలీసులకు చెందిన టాటా సుమోను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీ చేశారు. ఈ విషయాన్ని సెబ్ సిబ్బంది శనివారం పొద్దున గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎక్సైజ్ సెబ్ స్టేషన్‌కు అద్దె ప్రాతిపదికన ఓ సుమోను ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు విధులు నిర్వహించాక సెబ్ స్టేషన్ వద్ద స్థలం లేక రోడ్డు పక్కనే పెట్టుకునేవారు. ఇలా ఉండగా శుక్రవారం రాత్రి రోడ్డు పక్కన ఉన్న వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు చోరీచేశారు. సుమోను చోరీ చేయడం అక్కడికి సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించారు. ఈ చోరీపై సెబ్ ఎస్ఐ రామదాసు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా సాంకేతికంగా విచారణ చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రొంపిచెర్ల: మండలంలోని దండపాణి మామిడి తోట వద్ద మదనపల్లె- తిరుపతి రహదారిపై ఆదివారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. మదనపల్లె డిపో ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి వెళుతూ కలికిరి నుంచి తిరుపతి వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన చైతన్య కుమార్ రెడ్డి (37) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా పీలేరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

● రసాభాసగా టీడీపీ కార్యకర్తల సమావేశం



మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితో టీడీపీ కార్యకర్తల వాగ్వాదం

శ్రీరంగరాజపురం : జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం శనివారం రసాభాసగా మారింది. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, గాలి భాను ప్రకాష్, ఎమ్మెల్సీ దొరబాబు, బీద రవిచంద్రయాదవ్ సమక్షంలోనే బాహాబాహీకి దిగారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమితుడైన థామస్‌ను పరిచయం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇప్పటి వరకు నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు నిర్వర్తించిన చిట్టిబాబునాయుడు రావడంతో వివాదం మొదలైంది. చిట్టిబాబు రాకను మొత్తం ఆరు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు చిట్టిబాబు సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఆగ్రహించిన చిట్టిబాబు అనుచరులు వీరంగం సృష్టించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా థామస్‌ను ప్రకటించినా తమకు అభ్యంతరం లేదని, పార్టీ నియోజకవర్గ బాధ్యతలు మాత్రం చిట్టిబాబుకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో స్థానిక దళిత నేతలకు, చిట్టిబాబు అనుచరులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దళితులు పార్టీ ఇన్‌చార్జిగా పనికిరారా, జెండాలు మోసేందుకేనా ఉండేది అంటూ దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ల విషయంలో చిట్టిబాబు అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో కూడా ముడుపులు వసూలు చేశారని మండిపడ్డారు. థామస్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ప్రజలకు సేవలు అందించానని, నియోజకవర్గంలో అదే విధంగా పనిచేయాలని ముందుకు వస్తే అడ్డుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కోరిక మేరకే రాజకీయాల్లోకి వచ్చానని, ఇలా అడ్డుకుంటే విరమించుకుంటానని తేల్చిచెప్పేశారు. దీంతో స్థానిక దళిత నేతల్లో ఆగ్రహం మిన్నంటింది. టీడీపీకి దళితుల ఓట్లు మాత్రమే కావాలా, మాకు ఎలాంటి పదవులు ఇవ్వరా అంటూ మండిపడ్డారు. గొడవ మరింత ముదరడంతో చేసేదిలేక అమరనాథ్ రెడ్డి ఇతర నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం చిట్టిబాబునాయుడు వర్గం, జయశంకర్ నాయుడు వర్గం కుర్చీలతో పరస్పరం దాడులకు దిగడంతో సమావేశ ప్రాంగణం రణరంగంగా మారిపోయింది.

మక్కా యాత్ర ఎంతో అదృష్టం



పుంగనూరు నుంచి హజ్‌యాత్రకు బయలుదేరిన ముస్లింలతో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, అజీజ్‌సాబ్

● ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు ముస్లింల కృతజ్ఞతలు

పుంగనూరు: ముస్లింలు మక్కాయాత్ర చేయడం ఎంతో అదృష్టమని, యాత్రకు వెళ్లే వారికి ఇబ్బందులు లేకుండా ఒక్కొక్కరికి రూ.80 వేలు జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తెలిపారు. పుంగనూరు నుంచి శనివారం రాత్రి 31 మంది ముస్లింలు హజ్‌యాత్రకు బయలుదేరారు. వారు ఇందిరా సర్కిల్‌లో ప్రార్థనలు చేశారు. అమ్ము మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 2,500 మంది ముస్లింలు ఒక్కొక్కరికి రూ.80 వేలను ప్రభుత్వం ఇవ్వడం అభినందనీయమన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సహకారం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అజీజ్‌సాబ్, ఎస్‌కె పి.ఖాజా, అఫ్సర్, మహబూబ్‌బాషా, నౌషాద్, ఎంకెబి.అర్షద్, జాకీర్, అంజుమన్ కమిటీ సభ్యులు, ముతవల్లీలు పాల్గొన్నారు.

చెట్టు మీద పడి చిన్నారి మృతి



సిరి మృతదేహం

పూతలపట్టు: మండలంలో శనివారం ఈదురు గాలికి తాటి చెట్టు కూలి మీద పడడంతో చిన్నారి మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన టి.ప్రకాష్ కుటుంబంతో కలిసి ఏడాది క్రితం పూతలపట్టు మండలం గువ్వల కాలనీకి వచ్చాడు. అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం ఈదురు గాలులు ఎక్కువగా వీయడంతో ప్రకాష్ కూతురు సిరి(6), భార్యతో కలిసి పక్కనున్న తాటి చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో తాటిచెట్టు కూలి బాలికపై పడింది. తీవ్రంగా గాయపడిన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ వెంటే..



తాము ఎవరికీ బానిసలు కాదంటూ గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యానర్(ఇన్‌సెట్లో) బ్యానర్

పలమనేరు : మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ అయ్యంరెడ్డిపల్లెలో స్థానిక యువత కట్టిన బ్యానర్ చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేతలకు తాము బానిసలం కాదని, వైఎస్సార్‌సీపీకి అభిమానులమని, ఎప్పటికీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వెంటే ఉంటామని అందులో పేర్కొన్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి దీనిపై ఉలిక్కిపడ్డారు. ఏం చేశారో తెలియదు కానీ, వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు మళ్లీ టీడీపీ కండువా కప్పుకున్నాయి. ఎమ్మెల్యే వెంకటేగౌడ మనుషులు బెదిరించి తమను పార్టీలో చేర్చుకున్నారని సోషల్ మీడియాలో స్టేట్‌మెంట్ ఇచ్చేశాయి. ఈ పరిణామాలు అయ్యంరెడ్డిపల్లెవాసులకు ఆగ్రహం తెప్పించాయి. స్థానిక యువకులు తాము వైఎస్సార్‌సీపీలోనే ఉంటామంటూ స్పష్టంగా బ్యానర్ ఏర్పాటు చేసి మరీ ప్రకటించేశారు. టీడీపీ నేతల వక్రబుద్ధి కారణంగా వివాదం తలెత్తిందని గ్రామస్తులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

పాపం పసికందు

● చెత్తదిబ్బలో నవజాత శిశువు



ఐసీడీఎస్ సిబ్బంది చేతిలో శిశువు

రామకుప్పం: నవమాసాలు మోసిన ఆ తల్లి రక్తం పంచుకుని, పేగు తెంచుకుని పుట్టిన బిడ్డపై మమకారాన్ని చంపుకుంది. అవాంఛనీయ గర్భమా లేక ఆడబిడ్డంటే అలుసా... కారణమేంటో తెలియదు కానీ పండంటి బిడ్డను కని చెత్తదిబ్బలో పడేసింది. మండలంలోని చెల్దిగానిపల్లె–పలమనేరు జాతీయ రహదారి పక్కన శనివారం చెత్తకుప్పలో పసికందు ఏడుపులు వినిపించాయి. అది విన్న స్థానికులు అక్కడికి చేరుకుని, దిబ్బలో పడి ఉన్న నవజాత శిశువును చూసి చలించిపోయారు. వెంటనే జంతువుల బారిన పడకుండా పసిపాపను రక్షించారు. అనంతరం సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు పసికందును వైద్యసేవలు నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బరువు తక్కువగా ఉండడంతో బిడ్డను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు సూచించారు. ఈ బిడ్డను దత్తత తీసుకోవడానికి మాజీ రెస్కో డైరెక్టర్ నిరంజన్ రెడ్డి దంపతులు ముందుకురాగా చిత్తూరు శిశు సంరక్షణ కేంద్రానికి తరలించిన అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు బిడ్డను దత్తత తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు వారికి తెలిపారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

పూతలపట్టు: విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞానం సంపాదించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సైనార్ మధుబాల తెలిపారు. శనివారం పూతపట్టు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా గ్రంథాలయంలో పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేత గౌహతిరెడ్డి మాట్లాడుతూ సమయం దొరికినప్పుడల్లా పుస్తకాలతో గడపాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రవీంద్రబాబు, ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐరాల: విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకుని ఉన్నత స్థానాలుకు ఎదగాలని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజనల్ చైర్‌పర్సన్ శైలాజచరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల ఆకాంక్షించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి, లైబ్రేరియన్ సుజాత, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.